క్లుప్తంగా

8 నుంచి వల్లెలాంబదేవి ఉత్సవాలు



ఆహ్వాన పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: స్థానిక హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రథోత్సవ ఆహ్వాన కరపత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 8 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. 8న గోపూజ, గణపతి పూజ, గంగ పూజ, సాయంత్రం ప్రభోత్సవం, 9వ తేదీ ఉగాది రోజున అమ్మవారి రథోత్సవం, 10న పార్వేట, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూలవాసు, సాలప్ప, రమేష్‌నాయుడు, మల్లారెడ్డి, హనుమంతు, రవికుమార్ రెడ్డి, రవిబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ



ఉద్యోగులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: పింఛన్ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ సహాయకులతో పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. ఈనెల 3వ తేదీ నుంచి ఆయా సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. పలు సూచనలు చేశారు.

సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

గూడూరు రూరల్: గ్రామ సచివాలయాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. పింఛన్‌దారులు ఆధార్‌కార్డు లేదా పింఛన్ మంజూరు కార్డును తీసుకెళ్లి పింఛన్ తీసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి..

గూడూరు: నగర పంచాయతీ పరిధిలో సామాజిక పింఛన్లను ఈ నెల 3వ తేదీ నుంచి వార్డు సచివాలయాల్లో పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

జగనన్న వస్తేనే ఇంటి ముంగిటకు సేవలు



29వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుమార్తె మాధవీలత

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటేనే ఇంటి ముంగిటకు సేవలు.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కుమార్తె మాధవీలత అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్‌లోని 29వ వార్డు ఎస్‌ఎస్‌ఆర్ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన తండ్రిని గెలిపించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే రావాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో కుమ్ములాట

కోడుమూరు: టీడీపీ నేత కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వర్గానికి చెందిన జూలకల్ సుధాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా గ్రూపులు కట్టి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని.. అతన్ని గూడూరు మండల కన్వీనర్ బాధ్యతల నుంచి తొలగించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. పార్టీలో సభ్యత్వం లేని అభ్యర్థిని మండల కన్వీనర్‌గా నియమించాలని బొగ్గుల దస్తగిరి చేసిన సిఫారసు టీడీపీ నేతలకు మరింత ఆగ్రహం కలిగించింది. బొగ్గుల దస్తగిరికే పార్టీలో సభ్యత్వం లేదు, తనను తొలగించే హక్కు దస్తగిరికి ఎక్కడిదంటూ సుధాకర్ రెడ్డి ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాసమూర్తి ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉంటే కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి రబ్బరు స్టాంప్‌లా వ్యవహరిస్తున్నాడు. ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకు అతని ఇంటి వద్దే కాపు కాస్తున్నాడు. తనకు తెలియకుండా ఎవరెవరినో కలిసి గ్రూపులు కడతాడన్న భయంతో విష్ణువర్ధన్‌రెడ్డి తన ఇంటి ముందే దస్తగిరికి అద్దె ఇంటిని ఇప్పించాడు. విష్ణు రబ్బరుస్టాంప్‌లా వ్యవహరిస్తున్న బొగ్గుల దస్తగిరిని నమ్మి టీడీపీకి పనిచేసేందుకు నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు భయపడుతున్నారు.

పేదల సంతోషం చూడలేవా బాబు!

- వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకోవడంపై సర్వత్రా అసంతృప్తి
- గతంలోలా ఆపసోపాలు పడలేమంటున్న వృద్ధులు
- టీడీపీ తీరుపై మండిపాటు
- రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామంటున్న లబ్ధిదారులు

ఒకటో తేదీ రాగానే సూర్యోదయానికి ముందే వలంటీర్లు ఇంటి తలుపుతట్టి పింఛన్ చేతిలో పెడుతుండడంతో మురిసిపోయారు. టీడీపీ హయాంలోలా కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలు తొలగిపోయాయని సంబరపడ్డారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతూ వలంటీర్ వ్యవస్థపై తన అక్కసును వెళ్లగక్కారు. తన అనుకూల వ్యక్తులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారు. ఈ నెల పింఛన్ సొమ్ము కోసం ఎదురుచూసిన పండుటాకులకు తీవ్ర నిరాశే ఎదురైంది. తాము సంతోషంగా ఉండడం చంద్రబాబుకు ఇష్టం లేదంటూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గడివేముల: గత టీడీపీ హయాంలో పింఛన్ కోసం కార్యాలయాల వద్ద గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి. ఎప్పుడు.. ఏ రోజు ఇస్తారో తెలియదు. వానొచ్చినా.. ఎండున్నా వ్యయప్రాయసలకు ఓర్చి కార్యాలయాల చుట్టూ తిరిగితే కాని తీసుకోలేని పరిస్థితి. కొన్నిసార్లు డబ్బులు లేవని మరుసటి రోజు రమ్మని వెనక్కు పంపేవారు. గంటల తరబడి క్యూలో ఉండలేక ఎంతో మంది కళ్లు తిరిగి పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. వీరందరి బాధలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే పింఛన్ అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి అక్కడికే వెళ్లి పింఛన్లు అందజేసిన సందర్భాలు ఎన్నో. ఎన్నికల హామీలో భాగంగా పింఛన్‌ను దశల వారీగా రూ.3 వేలకు పెంచారు. దీంతో తమ కష్టాలు తొలగిపోయాయని వృద్ధులు ఎంతో సంతోషపడ్డారు. ఎలాంటి సిఫార్సు లేకుండా అర్హులందరికీ పింఛన్లు మంజూరు కావడంతో తమకు మంచి



కరిమద్దెల గ్రామంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

రోజులు వచ్చాయని మురిసిపోయారు. ఇది చూసి ఓర్వలేని తెలుగుదేశం పార్టీ ఎన్నికల కోడ్‌ను అడ్డు పెట్టుకుని అక్కసును వెళ్లగక్కింది. తమ అనుకూల సంస్థ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘంకు ఫిర్యాదు చేసి వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకుంది. ప్రతి నెలా మాదిరిగా గానే ఏప్రిల్ ఒకటో తేదీ గంపెడాశలతో పింఛన్ కోసం ఎదురుచూసిన పండుటాకులకు తీవ్ర నిరాశ మిగిలింది. టీడీపీ కూటమి కుటిల రాజకీయాలతో వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు, పింఛన్ల పంపిణీపై ఆంక్షలు విధించడంపై వృద్ధులు మండిపడుతున్నారు. గడివేముల మండలంలో 14 సచివాలయ పరిధిలో 5,864 పింఛన్‌దారులు ఉన్నారు.



నంద్యాలలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిందుకూరు రామలక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

ఆ రోజులు తలుచుకుంటనే భయమేస్తోంది



ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే వలంటీర్ తలుపుతట్టి పింఛన్ ఇస్తున్నారు. ఆంక్షల కారణంగా పింఛన్ తీసుకోవాలంటే మా ఊరి నుంచి 4 కిలోమీటర్ల దూరంలోని కొత్తూరు గ్రామ సచివాలయం వద్దకు వెళ్లాలి. వృద్ధాప్యం, ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఎండలో అంతదూరం వెళ్లాలంటే చాలా కష్టం. గతంలో పడిన ఇబ్బందులు గుర్తుకు వస్తున్నాయి. ఆ రోజులు తలుచుకుంటేనే భయం వేస్తోంది. మాలాంటి పేదలకు సేవ చేస్తున్న వలంటీర్లపై ఎందుకంత కక్ష. ఇలాంటి నిర్ణయాలు మా ప్రాణంమీదకు తెచ్చేలా ఉంది.

–జంగం పుల్లమ్మ, అహల్యాపురం, పాణ్యం

ఆ తిప్పలు మాకొద్దు



గతంలో పింఛన్ల కోసం పడిన తిప్పలు మాకొద్దు. వృద్ధాప్య భారంతో ఇబ్బంది పడుతుంటే పింఛన్‌ను వలంటీర్ల ద్వారా ఇంటికే పంపిస్తున్న సీఎం జగన్ చేసిన మంచి పనిని అభినందించాలే గాని అసూయ పడకూడదు. సచివాలయం వద్ద క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడే ఓపిక, సహనం మాకు లేదు. కరోనా సమయంలో చంద్రబాబు మా ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగిన దాఖలాలు లేవు. వలంటీర్ సొంత మనిషిలా మా ఇంటి వద్దకు వచ్చి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని అవసరమైన మందులను ఉచితంగా అందజేశాడు. సొంత కుటుంబ సభ్యులే ఇంటి వద్దకు రావాలంటే భయపడే సమయంలో వలంటీర్ నేనున్నాంటూ మాలో ధైర్యాన్ని నింపాడు. పేదలకు మంచి చేస్తున్న వలంటీర్లపై రాజకీయాలు చేయడం సరికాదు.

–దస్తగిరి, వృద్ధాప్య పింఛన్‌దారుడు, గడివేముల

ఆస్పత్రిలో పింఛన్ అందజేసి ఆదుకున్నారు



నేను గతంలో అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాను. ఆ నెల పింఛన్ రాదనుకున్నా. అయితే వలంటీర్ ఆస్పత్రికే వచ్చి పింఛన్ అందజేయడంతో ఆ నగదు మాకు ఎంతో ఉపయోగపడింది. గతంలో మాదిరిగా పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు పరిస్థితి లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎక్కడ ఉంటే అక్కడికివచ్చి పింఛన్ ఇస్తున్నారు. అలాంటి వలంటీర్లపై చంద్రబాబు కక్ష పెంచుకోవడం పద్ధతి కాదు. పేదలు సంతోషంగా ఉండడం ఆయనకు ఇష్టం లేదు. కుటిల రాజకీయాలు చేసే వారికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం.

–కురువ లక్ష్మీదేవి, వితంతుపింఛన్‌దారు, పెసరవాయి

పేదలను ఇబ్బంది పెట్టడం సరికాదు



ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం సరికాదు. దీని వల్ల మాలాంటి పేదలకే ఇబ్బంది. ఒకప్పుడు పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ ఆఫీస్ లేదా గుడి వద్ద ఎదరుచూసేవాళ్లం. రెండుమూడు రోజులు తిరిగితే కాని చేతికి అందేది కాదు. ఐదేళ్లుగా ఆ తిప్పలు లేకుండా వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలో ఆఫీస్‌ల దగ్గర తీసుకోవాలంటే చాలా కష్టం. ఆరోగ్యం సహకరించడం లేదు. ఇంటి నుంచి బయటకి కదలలేని పరిస్థితిలో ఉన్నాను. ఎలా వెళ్లాలి. మేం ఏం తప్పు చేశామని ఇలా మాపై కక్షకట్టారు.

–సంజన్న, పింఛన్‌దారుడు, సి.బెళగల్

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రిబాయి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రిబాయిని నియమించారు. గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఆమెకు గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి అప్పగించారు. గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్న వెంకటతులసమ్మ గత నెల 31న పదవీ విరమణ చెందడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ప్రవీణ్ కుమార్

గూడూరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సోమవారం గూడూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులు, స్టాక్ రిజిష్టర్, ల్యాబ్, సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు అవగాహన కల్పించి ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేసుకునేలా చూడాలన్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారిణి షఫియా బేగం, ఎంపీహెచ్‌ఈఓ రామకృష్ణ, సూపర్‌వైజర్ రాఘవయ్య ఉన్నారు.

కారు బోల్తా



పాణ్యం: మండలంలోని శాంతిరాం ఆస్పత్రి వద్ద కారు బోల్తా పడింది. సోమవారం పాణ్యం వైపు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఓ కారు శాంతిరాం ఆస్పత్రి వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఎవరికీ గాయాలు కాలేదు. కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నారు.

హంస వాహనంపై మాధవుని వైభవం



హంసవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు స్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వసంతోత్సవం, చక్రస్నానం, కంకణ విసర్జన కార్యక్రమాలు జరిగాయి. 12రోజుల పాటు స్వామివారి ఉత్సవాలను దేవదాయ శాఖాధికారులు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.

అధైర్యపడకండి..అండగా ఉంటా



నరాల వ్యాధితో బాధపడుతున్న దానయ్య కుమారుడు మధుతో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: ఆరోగ్య సమస్యలతో బాధపడే వారు అధైర్యపడాల్సిన అవసరం లేదని..తాను అండగా ఉంటానని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ బాధితులకు భరోసా ఇచ్చారు. గూడూరు నగర పంచాయతీకి చెందిన శేషన్న కుమార్తె గుండె సంబంధిత వ్యాధితో, దానయ్య కుమారుడు మధు నరాల వ్యాధితో బాధపడుతున్నారు. వారి కుటుంబసభ్యులు సోమవారం సతీష్‌ను నగరంలోని ఆయన స్వగృహంలో కలిసి సమస్యను తెలియజేశారు. స్పందించిన ఆయన వెంటనే ఆరోగ్యశ్రీ వైద్యాధికారులతో మాట్లాడారు. త్వరలో ఆయా జబ్బులకు వైద్య చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు.



గుండె వ్యాధితో బాధపడుతున్న శేషన్న కుమార్తెతో..

సంక్షేమ పాలనకు అండగా నిలవండి

గడివేముల: సంక్షేమ పాలన చేస్తున్న వైఎస్సార్‌సీపీకి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు శివనరసింహారెడ్డి కోరారు. సోమవారం గడివేముల మండల పరిధిలోని ఒండుట్ల, పైబోగుల, ఎల్‌కే తండా, గని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడికి మేలు జరుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, వైస్ ఎంపీపీ కాలునాయక్, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి, శివానందరెడ్డి, రవీంద్రారెడ్డి, మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒండుట్లగ్రామంలో ప్రచారం చేస్తున్న కాటసాని శివనరసింహారెడ్డి

సారా స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి మండలం బోయినపల్లి, గోవర్ధనగిరి, ఎల్‌బండ గ్రామాల్లో సెబ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. సారా విక్రయిస్తున్న సాలమ్మ, సుంకన్న, అయ్యస్వామిలపై కేసు నమోదు చేశామన్నారు. వారిని డోన్ కోర్టులో హాజరుపరచగా, జడ్జి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ అలీబేగ్, కానిస్టేబుళ్లు హనుమంతు, శంకర్‌నాయక్, విరుపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్, సువర్ణమ్మ పాల్గొన్నారు.



పట్టుబడిన సారాను చూపుతున్న సెబ్ అధికారులు

సంక్షేమ పాలనను మళ్లీ తెచ్చుకుందాం



34వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు (న్యూటౌన్): సంక్షేమ పాలన ఇలానే కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 34వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. పాణ్యం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. ఇంటి ముంగిటకే సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, ఆర్‌బీకేలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జగనన్న జెండా, ఎజెండా పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధేనని అన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి మోసపూరిత హామీలిస్తున్న టీడీపీ నాయకులను నమ్మి మోసపోవద్దని అన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ఆయన వెంట 34వ వార్డు కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన పుసులూరు రాముడు, వడ్డె మద్దిలేటి, బోయ రాముడు, సుంకన్న గౌడు, హరిజన చంద్ర, అంజి, మహేష్‌నాయుడు, వీరన్న, పర్ల నాగేషులు, ప్రభాకర్, నాగరాజు, బీసీ నాయుడు, గొల్ల గోపాల్, గరక మూగన్న సహా 20 కుటుంబాలకు ఎమ్మెల్యే కాటసాని పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్ రెడ్డి, చాంద్‌బాషా, మస్తాన్, నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీఎంలో ముగిసిన క్రీడా పోటీలు



బహుమతులు అందజేస్తున్న చెర్మన్ శాంతిరాముడు

పాణ్యం: మండల పరిధిలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన ఆర్‌పీఎల్ క్రీడలు సోమవారంతో ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులను కళాశాల చెర్మన్ శాంతిరాముడు బహుమతులను ప్రదానం చేశారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ ఈసీఈ జట్టు కైవసం చేసుకున్నట్లు పీడీ వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, నారాయణరెడ్డి, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మహిళా సాధికారత

పాణ్యం: వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని.. అవి కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. సోమవారం పాణ్యం మండలం కొణిదేడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలు లబ్ధిపొందాయని తెలిపారు. పేదలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాణ్యం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని.. మరోసారి ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. గడిచిన ఐదేళ్లలో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. ఎస్సార్బీసీ, కేసీతోపాటు ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద ఆయకట్టు రైతులకు ఇబ్బందులు రాకుండా చేశారన్నారు. ప్రజలు ఆలోచించి మంచి చేసే నాయకుడికి అండగా ఉండాలని కోరారు. ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కర్నూల్ డిప్యూటీ మేయర్ రేణుకా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవిరెడ్డి, సర్పంచ్ సువార్తమ్మ, నాయకులు అశోక్‌రెడ్డి, గోపిరెడ్డి గీతా, సుబ్బారెడ్డి, జయచంద్రారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కాటసాని ఉమామహేశ్వరమ్మ

ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు

కర్నూలు (న్యూటౌన్): దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం కర్నూలు నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్, కిరాణ, బేకరీ షాపుల్లో తనిఖీలు చేశారు. అధిక ధరకు విక్రయిస్తుండడంతో రెండు కేసులు నమోదు చేసి రూ.2 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయించినా, ముద్రలు లేని తూనిక రాళ్లు వాడినా కఠిన చర్యలు తప్పవన్నారు.



కేసు నమోదు చేస్తున్న తూనికలు కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్